AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
21-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

'నీట్'కు నలుగురు విద్యార్థులు ఆలస్యం..


2


2

రోడ్లపై చెత్తాచెదారం..

## టీఎన్జీవోస్‌కు ఇందిర అందించిన సేవలు మరువలేనివి..



**అక్షరటుడే,ఇందూరు:** నిజామాబాద్ టీఎన్జీవోస్‌లో మహిళా జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఇందిర అందించిన సేవలు మరువలేనివని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ లో ఇటీవల పదవీవిరమణ చేసిన ఇందిర, ఆనంద్‌రావు దంపతులను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, జాకీర్ హుస్సేన్, మారుతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలంటే

# అంతా నిర్లక్ష్యమా..?

నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద సీసీ కెమెరా ఉన్న స్తంభం ఇటీవల కారు ఢీకొనడంతో పడిపోయింది. అప్పటి నుంచి ఈ స్తంభాన్ని పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని చెప్పే పోలీస్‌శాఖ.. నగరంలోని ప్రధాన కూడలిలో పడిపోయిన సీసీ కెమెరా పోల్‌పై నిర్లక్ష్యం వహించడం చర్చనీయాంశమైంది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## ఉత్సాహంగా యోగా సంబరం..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు.చిన్నాపెద్దా అంతా కలిసి యోగాసనాలు వేశారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆయుష్ శాఖ, రెడ్‌క్రాస్ తదితర సంస్థల ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



– మిగతా ఫొటోలు 2వ పేజీలో..




# దర్జాగా గంజాయి దందా

రాష్ట్రంలో గంజాయి మాఫియా రూటు మార్చింది. రోడ్డు మార్గంలో పోలీసు, ఎక్సైజ్ శాఖల నిఘా పెరగడతో స్మగ్లర్లు ఇప్పుడు రైల్వే మార్గాన్ని 'సేఫ్ కారిడార్'గా మార్చుకున్నారు. అనుమానం రాకుండా, చెక్‌పోస్టుల భయం లేకుండా పెద్ద మొత్తంలో ఎండు గంజాయిని రైళ్ల ద్వారానే జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా కామారెడ్డి జాతీయ రహదారిపై పోలీసులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సుమారు 3 క్వింటాళ్ల భారీ గంజాయి పట్టుబడటంతో ఈ కొత్త దందా వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి




■ రైల్వే మార్గమే అడ్డాగా తరలింపు.. ■ కామారెడ్డిలో 3.87 క్వింటాళ్లు పట్టివేత ■ వారంలో రెండుసార్లు దొరికినా ఆగని స్మగ్లింగ్

లారీలు, డీసీఎంలు, కార్లలో రహస్య అరల్లో గంజాయి దాచి తరలించే స్మగ్లర్లు ఇప్పుడు పూర్తిగా పంథా మార్చారు. ఒడిశా, ఆంధ్రలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి సేకరించిన ఎండు గంజాయిని కిలో, రెండు కిలోల ప్యాకెట్లుగా చేసి, టేపులతో ప్యాక్ చేసి సాధారణ ప్రయాణికుల లగేజీ మాదిరిగా రైలు ఎక్కిస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లలోనూ ఈ తరలింపు జరుగుతోంది. సీట్ల కింద, బెర్తుల పైన, బాత్‌రూమ్‌ల సమీపంలో, లగేజీ కంపార్ట్‌మెంట్లలో ఎవరికీ అనుమానం రాకుండా దాచిపెడుతున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా వెళ్లే రైళ్లలో ఈ తరహా రవాణా ఎక్కువగా ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇక్కడి నుంచి హైదరాబాద్, వరంగల్‌తో పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, ముంబై వరకు గంజాయి చేరుతోంది.

### వారంలో రెండుసార్లు

కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో గంజాయి దందా ఏ స్థాయిలో సాగుతోందో చెప్పేందుకు తాజా ఘటనలే నిదర్శనం. వారం రోజుల వ్యవధిలోనే రైల్వే పోలీసులు రెండుసార్లు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ స్మగ్లర్లలో ఏ మాత్రం భయం కనిపించడం లేదు. దొరికినా ఒకట్రెండు రోజులు ఆగి మళ్లీ యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు. 'క్యారియర్లు'గా యువతను, నిరుద్యోగులను వాడుకుంటున్నారు. ఒకసారి సరుకును గమ్యస్థానానికి చేరిస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తుండటంతో డబ్బుకు ఆశపడి పలువురు ఈ ముఠాలకు చిక్కుతున్నట్టుగా ప్రచారం సాగుతోంది.

### కొరవడిన నిఘా..

రైల్వే స్టేషన్లలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే పోలీస్ సిబ్బంది ఉన్నప్పటికీ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రతి బోగీని, ప్రతి లగేజీని తనిఖీ చేయడం సాధ్యం కావడం లేదు. కామారెడ్డి రైల్వే స్టేషన్లో సిబ్బంది కొరత వేధించడం కూడా ఒక కారణమేనని తెలుస్తోంది. దీనినే ఆసరాగా చేసుకుని గాంజా మాఫియా చెలరేగిపోతోంది. రైలు ఎక్కితే మార్గమధ్యంలో ఎక్కడా తనిఖీలు ఉండవని, ఒకవేళ ఉన్నా తప్పించుకోవడం సులభమని స్మగ్లర్లు భావిస్తున్నారు. పైగా రైలు ప్రయాణం ఖర్చు తక్కువ, రిస్క్ కూడా తక్కువని ఆలోచిస్తున్నారు.

### మూడు కేసులు

కామారెడ్డి పట్టణం మీదుగా గంజాయి సరఫరా చేస్తున్న వాటి ముఠా ఆగడాలు ఇటీవల శృతిమించాయి. గడిచిన వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నారు. ఈ నెల 9న కామారెడ్డి రైల్వే స్టేషన్ లో రైలులో అక్రమంగా తరలిస్తున్న 10 కిలోల గంజాయి పట్టుకోగా 20న 20 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 20వ తేదీన సాయంత్రం జాతీయ రహదారిపై పనస పండ్ల వాహనంలో గుట్టుగా తరలిస్తున్న 3.87 క్వింటాళ్ల భారీ గంజాయిని కామారెడ్డి పోలీసులు పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు.

### ప్రత్యేక నిఘా కొనసాగుతోంది

గంజాయి అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతోంది. ఇప్పటికే ఆపరేషన్ కవచ్ పేరుతో ఎక్కడికక్కడ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నాం. గంజాయి, డ్రగ్స్ సరఫరాతో యువత చెడుమార్గం వైపు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. తల్లిదండ్రులు సైతం పిల్లలపై నిఘా పెట్టాలి.

– రాజేష్ చంద్ర, ఎస్పీ

## యూత్ కాంగ్రెస్ గ్రామాధ్యక్షుల ఎన్నిక



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పలు గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ గ్రామాధ్యక్షులను ఎన్నుకున్నారు. మండలంలోని జువ్వాడి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ యూత్ అధ్యక్షుడిగా గైని రంజిత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అలాగే బ్రాహ్మణపల్లి సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గణేష్ ఆధ్వర్యంలో రమేష్‌ను, పెట్ సంగెంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాకలి రాజు అధ్యక్షతన అచ్యుత్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. వినయ్ కుమార్, ఆంజనేయులు, నరేష్, భాను గౌడ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా గోస.. ఉప్పలవాయిలో రోడ్డెక్కిన రైతులు



**అక్షరటుడే, కామారెడ్డి :** రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో ఆదివారం రైతన్నలు రోడ్డెక్కారు. ఖరీఫ్ సాగు ఊపందుకున్న తరుణంలో పొలాలకు యూరియా దొరక్క రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ విధానం తమ పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులు, ఫోన్ సౌకర్యం లేని పల్లెవాసులు యాప్‌లో నమోదు చేసుకోలేక బస్తా యూరియా కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. వెంటనే యూరియా యాప్ విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగానే సొసైటీలు, డీలర్ల ద్వారా నేరుగా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. వరి నాట్లు వేసే సమయం దాటిపోతున్నా చేతికి బస్తా రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రాస్తారోకో కారణంగా ఉప్పలవాయిరామారెడ్డి ప్రధాన రహదారిపై దాదాపు గంటపాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



## 'నీట్' కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

**అక్షరటుడే, బోధన్ :** పట్టణంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ డీసీపీ శుభం ప్రకాష్ ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని కేంద్రాలను సందర్శించిన ఆయన, భద్రతా ఏర్పాట్లను, పరీక్ష జరుగుతున్న తీరును స్వయంగా పర్యవేక్షించారు. ఈ తనిఖీల్లో డీసీపీతో పాటు బోధన్ ఏసీపీ శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

## వివాదాలు వద్దు.. కలిసి పని చేయండి..



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలపై పార్టీ క్రమశిక్షణ కమిటీ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మధ్య నెలకొన్న పరస్పర విభేదాలు, ఫిర్యాదులపై కమిటీ ఆదివారం మరోసారి విచారణ చేపట్టింది. ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై తమ వాదన వినిపించిన గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతో పాటు, కమిటీ సూచన మేరకు ఆదివారం షబ్బీర్ అలీ కూడా హాజరయ్యారు. వివాదానికి కారణమైన ఆడియో కాల్ వ్యవహారంపై షబ్బీర్ అలీ ఇదివరకే కమిటీకి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఆదివారం కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఇరువర్గాలతో విడివిడిగా సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డి దంపతులతో కలిసి చర్చించి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించారు. సీనియర్ నేతల మధ్య విభేదాలు పార్టీకి నష్టం చేస్తాయని, వ్యక్తిగత విభేధాలను పక్కనపెట్టి పార్టీ బలోపేతం కోసం సమష్టిగా పనిచేయాలని మల్లు రవి ఇద్దరు నేతలకు సూచించారు. పోలీసు కేసులు, ఫిర్యాదులతో నేతల మధ్య దూరం పెరుగుతుందనే క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ సూచనలతో ఇరువురు నేతలు ఏకీభవించారు. వెంటనే ఒకరికొకరు స్వీట్లు పంచుకుని ఇకపై కలిసికట్టుగా పనిచేస్తామని కమిటీకి హామీ ఇచ్చారు. దీంతో కామారెడ్డి కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలకు క్రమశిక్షణ కమిటీ తెరదించింది. అయితే ఆడియో కాల్‌లో పీసీసీ చీఫ్‌పై షబ్బీర్ అలీ మాట్లాడిన అంశంపై మాత్రం మరోసారి విచారణ చేపట్టనున్నట్టు సమాచారం. కాగా.. గత 15 రోజులుగా కామారెడ్డి నేతల మధ్య విభేధాలు రచ్చకెక్కాయి. ఇరువర్గాల పోటాపోటీ ఫిర్యాదులతో కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో క్రమశిక్షణ కమిటీ సూచనతో ఇద్దరు నేతలు కలిసి పని చేస్తామని చెప్పడంతో వివాదం ముగిసింది.

## మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విజయవంతంగా స్పెషల్‌డ్రైవ్

**అక్షరటుడే, ఇందూరు:** వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిజామాబాద్ నగరంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ విజయవంతంగా పూర్తయిందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీ నుండి స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించామని, ప్రతి రోజు సగటున రెండు నుండి మూడు డివిజన్లలో విస్తృత స్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టి పూర్తి చేశామన్నారు. ఆయా డివిజన్లలో అర్బన్ ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యారని అన్నారు. ఒక్కో సర్కిల్ పరిధిలోని శానిటేషన్ కార్మికులు సుమారు వంద మంది చొప్పున సామూహికంగా పారిశుధ్య పనులను చేపట్టడంతో పరిశుభ్రత కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టగలిగామన్నారు. డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేయడం, చెత్తను తరలించడం, పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను శుభ్రం చేయడం వంటి పనులు అన్ని డివిజన్లలో పూర్తయ్యాయని తెలిపారు. మురుగును, చెత్తను నివాస ప్రాంతాల మధ్య నుండి వెంటదివెంట తరలించినట్లు చెప్పారు. వర్షాకాలంలో నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.



## ప్రశాంతంగా 'నీట్' పరీక్ష.. సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లాలో ఆదివారం 'నీట్' పరీక్ష విజయవంతంగా ముగిసింది. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'నీట్' పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించిన కలెక్టర్ పుటేజీల ఆధారంగా నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా.. లేదా.. అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్, పేపర్ లీక్‌కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద ఏర్పాటు చేసిన జామర్లను, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏఎన్ఎం బృందాలు పనితీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎగ్జామ్ హాల్‌లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. జిల్లాలో నీట్ పరీక్షకు 86.55 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని.. మొత్తం 3,459 మంది అభ్యర్థులకు గాను 2,994 మంది పరీక్ష రాయగా, 465 మంది గైర్హాజరయ్యారని వివరించారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగానే విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, సజావుగా నీట్ పరీక్షలు జరిగాయని ఆమె వివరించారు.

# ఉత్సాహంగా యోగా సంబరం..











## అధ్వానమైన రోడ్డుతో కౌలాస్ కోట భక్తుల అవస్థలు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలో శనివారం రాత్రి కురిసిన తొలి వర్షం ఎండ వేడి నుండి ఉపశమనం కలిగించినప్పటికీ, ప్రయాణికులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ప్రసిద్ధ కౌలాస్ కోట ఎల్లమ్మ మాత మందిరానికి వెళ్లే పోచారం తండా రోడ్డు కంకర తేలి రాకపోకలకు సాధ్యం కానీ స్థితికి చేరింది. రామారావు మహరాజ్ తండా సమీపంలో రోడ్డుపై పడ్డ పెద్ద పెద్ద గుంతలు వర్షపు నీటితో నిండిపోవడంతో ఆదివారం ఆలయానికి వెళ్లే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణించారు. ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందో అని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చి, రవాణా సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## 'నీట్'కు నలుగురు విద్యార్థులు ఆలస్యం..

జిల్లా వ్యాప్తంగా 'నీట్' పరీక్ష ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని ఎనిమిది సెంటర్లలో అధికారులు పరీక్షను నిర్వహించారు. నగరంలోని గిరిరాజ్ కళాశాల లో ఏర్పాటుచేసిన నీట్ పరీక్ష కేంద్రానికి నలుగురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. ఒక విద్యార్థి బోధన్ నుంచి రావాల్సి ఉండగా మార్గమధ్యంలో కారు పాడవడంతో పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా వచ్చాడు. అయితే సమయం దాటిన కారణంగా అధికారులు పరీక్ష కేంద్రంలోకి విద్యార్థిని అనుమతించలేదు. అలాగే మరో ముగ్గురు విద్యార్థులు సైతం 1:30 లోపు పరీక్ష కేంద్రానికి రావాల్సి ఉండగా సమయానికి రాలేదు. ఈ నలుగురిని అధికారులు పరీక్షకు అనుమతించలేదు. - అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్








## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సామగ్రి పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైవ శ్రీనివాస్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సామగ్రిని అందజేశారు. ఎంఈఓ గంగారాం ముఖ్యఅతిథిగా హాజరై సుమారు రూ.15 వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పెన్సిల్ బాక్సులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు శైవ శ్రీనివాస్ సేవా భావాన్ని అభినందించారు. కొత్తపల్లి శ్రీనివాస్, కొండ్రు నవీన్, చిన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నాగంపేట్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఆదివారం నిజామాబాద్‌కు చెందిన లక్షణ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ దాసరి గంగాధర్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరంలో నేత్ర వైద్యులు కరంపూరి శ్రీనివాస్, డా.వేదశ్రీ పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సూచనలు, చికిత్సలపై సలహాలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బొంల్లా రవి, పిండి గణేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## హౌసింగ్ బోర్డు ఓపెన్ జిమ్‌లో స్వచ్ఛ భారత్

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ జిమ్ ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిమ్ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 59వ ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఓపెన్ జిమ్‌లో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి నిత్యం ఎంతో మంది ఈ జిమ్‌లో వ్యాయమాలు చేస్తుంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జిమ్ చుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించామన్నారు. కోటేశ్వర్, సుంకె నిశాంత్, బట్టు సుమన్, జహీర్, కుతాడి ఎల్లయ్య, గుర్రం రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** న్యాల్‌కల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో ఆదివారం జరిపారు.

### 27 ఏళ్ల తర్వాత..

27 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్న పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తాము చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. ప్రస్తుతం తాము చేస్తున్న ఉద్యోగాలు.. బాధ్యతల గురించి చర్చించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్, రాజేందర్, నాగేశ్వరరావు, కాంతారావు, హేమలత, కృష్ణవేణి, స్వరూప, సూర్య కుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడడం చూసి మా శ్రమకు ఫలితం దక్కినట్లయ్యిందన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం గురువులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు బి.రమేష్, ఎం.శ్రీనివాస్, పి.లక్ష్మి తదితరులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు.



## రవాణాశాఖ కొరడా.. ఓవర్ లోడ్ వాహనాల సీజ్

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలో ఓవర్‌లోడ్‌తో చెలరేగిపోతున్న భారీ వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, జాయింట్ ట్రాన్స్ పోర్టు కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ డీటీసీ దుర్గ ప్రమీల సూచనల మేరకు శనివారం జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి వరకు చేపట్టిన ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి లోడ్‌తో తిరుగుతున్న మూడు భారీ వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు జిల్లా రవాణాధికారి టి.సంతోష్ కుమార్ వెల్లడించారు. ఓవర్‌లోడ్ వల్ల రోడ్లు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, క్వారీ నిర్వాహకులు, లారీ యజమానులు, డ్రైవర్లు ఎవరూ నిబంధనలు అతిక్రమించవద్దని డీటీఓ హెచ్చరించారు. మరోసారి ఓవర్‌లోడ్‌తో పట్టుబడితే వాహనాలు సీజ్ చేయడమే కాకుండా భారీ జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా జిల్లాలోని ప్రధాన రహదారులన్నింటిపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు. కాగా ఆదివారం కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి ఇప్పటి వరకు మరొక రెండు వాహనాలు సీజ్ చేసినట్టుగా తెలుస్తోంది. రాత్రి వరకు మరికొన్ని వాహనాలు సీజ్ చేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఎంవీఐ శంకర్ నారాయణ, ఏఎంవీఐలు రఫీ, కృష్ణ తేజ, రవాణాశాఖ కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.




**కామారెడ్డి మున్సిపల్ పరిధిలో పారి శుధ్య వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలోని 10కి పైగా వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో కాలనీల్లోకి వెళ్తుంటే దుర్వాసన వస్తోంది.** - అక్షరటుడే, కామారెడ్డి

## రోడ్లపై చెత్తాచెదారం..



# షెడ్లలోనే చెత్త వాహనాలు..

■ పారిశుధ్యంపై నిర్లక్ష్యం.. ■ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వీధి మూలల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి చెత్త తరలించకపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు, వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగింది. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆయా గ్రామాలకు చెత్త సేకరణ వాహనాలు వెళ్లడం లేదని, దీంతో గ్రామాలన్నీ చెత్తమయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో కలిపారు కానీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రిపేర్లలో చెత్త వాహనాలు..

పలు చెత్త తరలింపు వాహనాలు రిపేరుకు వచ్చి నెలలు గడుస్తున్నా వాటిని బాగు చేయించడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వాహనాలతో అన్ని ప్రాంతాలకు సర్వీస్ అందించలేకపోతున్నామని సిబ్బందే చెబుతున్నారు. ఇలా చెత్త పేరుకుపోవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి అధికారులు వెంటనే చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## కూలిన కంపోస్ట్ షెడ్.. పట్టించుకోని అధికారులు

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని అంజని గ్రామ పంచాయతీలో కంపోస్ట్ షెడ్ కూలిపోయి ఏడాది గడుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు కంపోస్ట్ షెడ్డు కూలి రేకులు గాలికి ఎగిరిపోయాయి. అప్పటి నుంచి ఈ షెడ్‌ను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కంపోస్ట్ షెడ్‌లో జీపీ సిబ్బంది చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించి తడిపొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసి ఎరువులను తయారుచేసేవారు. అయితే షెడ్ కూలినప్పటి నుంచి దాంట్లో ఎలాంటి కార్యకలాపాలు జరగట్లేదని.. వెంటనే జీపీ పాలకవర్గం, అధికారులు కూలిన షెడ్‌ను తిరిగి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

